సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 3 । అక్టోబర్ । 2024



కూటమి పాలనలో... గాంధీజీ ఆశయాలకు తూట్లు

టీడీపీ కూటమి ప్రభుత్వం గాంధీజీ ఆశయాలకు తూట్లు పొడుస్తోందని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర విమర్శించారు. - 8లో



విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి - 8లో

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కోరుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కార్మిక సంఘాలు ఆందోళన చేశాయి.



'పైడితల్లి' జాతరను విజయవంతం చేయాలి - 8లో

పైడితల్లి జాతరను విజయవంతం చేయాలని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు కోరారు.

న్యూస్‌రీల్

విజయనగరం ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

- మూడు రోజులపాటు లేబర్ హాలీడే ప్రకటించే అవకాశం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఉత్సవ నిర్వహణ కమిటీతో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన చాంబర్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి పండగకు లక్షలాదిమంది వచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు, భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆ మూడు రోజులపాటు లేబర్ హాలీడే ప్రకటించాలన్న విషయంపై చర్చించారు. హోటళ్లు, సంస్థలు, షాపుల్లో పనిచేసే కార్మికులు, ఇతర ఉద్యోగులను ఉత్సవాల్లో భాగస్వాములను చేసే ఉద్దేశంతో ఆ మూడు రోజులపాటు సెలవు ఇవ్వాలని యోచిస్తున్నట్టు వెల్లడించారు. ఆహార పదార్థాలకు ఇబ్బంది పడకుండా భారీ ఎత్తున ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎస్.డి.అనిత, సీపీఓ పి.బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, డీపీఓ శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

రక్తదాన 'సాధన'కు జాతీయస్థాయి గుర్తింపు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న దుర్గాప్రసాద్

నెల్లిమర్ల: రక్తదాన శిబిరాల నిర్వహణ, ఆపద సమయాన రక్తదానం చేసి ఆదుకుంటున్న జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. సంఘ అధ్యక్షుడు, 63 సార్లు రక్తదానం చేసిన పోలుబోతు దుర్గాప్రసాద్‌కు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో నిర్వహించిన జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్యశాఖ జాతీయ కార్యదర్శి డాక్టర్ అతుల్ గోయల్ బుధవారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. 14 సంవత్సరాలుగా రక్తదాన కార్యక్రమాలకు సంఘం చేస్తున్న కృషిని కొనియాడారు. జాతీయ సదస్సులో పోలుబోతు దుర్గప్రసాద్ మాట్లాడుతూ సాధన యువజన సంఘం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదానం చేస్తున్నామన్నారు. ఆ కృషి గ్రామస్థాయి నుంచి నేడు జాతీయ స్థాయిలో పేరుతెచ్చి పెట్టిందన్నారు. గుర్తింపు రావడంపై సంఘ సభ్యులు పసుమర్తి వెంకటరమణ, బెల్లాన వెంకటరావు, తుమ్మ అశోక్, మద్దిల కళ్యాణ్ సత్యవతి, అవునాపు అప్పలరాజు, మద్దిల రాంబాబు, పోలుబోతు భాస్కర్, ఉపాధ్యాయులు పి.రామారావు, కడలి ప్రకాశ్‌రావు, బొడ్డేపల్లి రామకృష్ణారావు, గ్రామ యువత ఆనందం వ్యక్తంచేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి వైష్ణవీ కళాక్షేత్రం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో అభినయప్రియ నర్తన నాటకశాలకు చెందిన ఎం.సాయిసుప్రియ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.

టోల్‌ప్లాజా సిబ్బందిపై దాడి

తగరపువలస: విజయనగరం జిల్లా డెంకాడ మండల పరిధి జొన్నాడ టోల్‌ప్లాజా వద్ద బుధవారం సాయంత్రం జరిగిన కొట్లాటలో పలువురు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నుంచి విజయనగరం వైపు వెళ్తున్న మ్యాక్సీ క్యాబ్ యజమాని నక్కా సురేష్ టోల్ ఫీజు చెల్లించకుండా ద్విచక్రవాహనాలు వెళ్లే దారిలో వెళ్తుండగా టోల్ కార్మికుడు లొడగల సురేష్ వాహనం ఫొటో తీశాడు. దీంతో వాహనం ఆపి వెనక్కి వచ్చిన నక్కా సురేష్ ఫొటో ఎందుకు తీశావని ప్రశ్నించగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్తా కొట్లాటకు దారితీసింది. దీంతో మరికొంత మంది మ్యాక్సీ కాబ్ సిబ్బంది ఈ గొడవలో పాల్గొన్నట్టు తెలిసింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నక్కా సురేష్‌ను విజయనగరం ఆస్పత్రికి, లొడగల సురేష్‌ను సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. టోల్‌ప్లాజాకు చెందిన సాయి, ఈశ్వరరావు, చిన్ని, ధనరాజ్ కూడా గాయపడ్డారు. భీమిలి సీఐ బి.సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువైపులా కేసులు నమోదు చేశారు.

కూటమి కొత్త మద్యం పాలసీపై..

మహిళల ఆగ్రహం



- మద్యం ఏరులై పారిస్తారా అంటూ నిలదీత
- మద్యం దుకాణాల సంఖ్య తగ్గించాలని డిమాండ్
- ప్రభుత్వ తీరు మార్చాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి వినతి
- పాలసీ మార్చకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తాం



పార్వతీపురం పట్టణంలో గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల ప్రతినిధులు

పార్వతీపురం టౌన్:

ప్రజలకు మేలు చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించేందుకు సిద్ధమయ్యారంటూ మహిళా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. పార్వతీపురంలో బుధవారం ఆందోళనకు దిగారు. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నూతన మద్యం పాలసీ ద్వారా రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు తెరలేపడం దుర్మార్గపు చర్య అంటూ మండిపడ్డారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బెల్టుషాపుల రద్దుకు మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పోరాటం చేశాయని గుర్తుచేశారు. నాణ్యమైన మద్యం తక్కువ ధరకు సరఫరా చేస్తామంటూ టెండర్లకు శ్రీకారం చుట్టడం దారుణమన్నారు. మాదక ద్రవ్యాలు నిర్మూలించాలంటే మద్యపానం పెంచాలని మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ మద్యం పాలసీని ఆదర్శంగా తీసుకోవడం సరికాదన్నారు. మద్యపాన నిషేధానికి బీహార్, తమిళనాడు, కేరళ ప్రయత్నాలు చేస్తున్నాయని, ఆ రాష్ట్రాల్లో పర్యటించిన రాష్ట్ర మంత్రివర్గ కమిటీ అక్కడి మద్యం పాలసీపై ఇచ్చిన నివేదిక బహిర్గతం చేయకుండా తొక్కిపెట్టారన్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రజల శ్రేయస్సును ప్రభుత్వం విస్మరిస్తోందనే విషయం స్పష్టమవుతోందన్నారు.

ప్రజల మానప్రాణాలతో ఆటలాడాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చి ప్రజల మానప్రాణాలతో ఆటలాడాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. జిల్లాకు 52 మద్యం దుకాణాలు మంజూరు చేయడం సరికాదన్నారు టెండర్ల ద్వారా రూ.వేల కోట్ల ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం చూస్తోందే తప్ప, ఆ తరువాత పర్యవసానాల గురించి ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. మద్యం పాలసీపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఎరువులు, ఆహార పదార్థాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఆందోళనలో ఐద్వా నాయకులు, మహిళా సమాఖ్య సభ్యులు, పలు మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తున్నాం



మద్యం నియంత్రించేలా, నేరాలను అరికట్టేలా నూతన మద్యం పాలసీని ప్రభుత్వం ప్రకటించాలి. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీని మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు, ఐక్యవేదిక సంఘాల సభ్యులమంతా కలిసికట్టుగా వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూడడం విచారకరం. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించకుండా మద్యం ధరలు తగ్గించడం బాధాకరం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేయాలి.

– రెడ్డి శ్రీదేవి, ఐద్వా, జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం

కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసేలా నూతన పాలసీ



కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసేలా నూతన మద్యం పాలసీని కూటమి ప్రభుత్వం రూపొందించింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. బడి, గుడి, జనవాసాల మధ్య మద్యం షాపులు పెట్టరాదు. దుకాణాల సంఖ్య పెంచడం విచారకరం. పట్టణాల్లో ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారు. దీనివల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుంది. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో కలహాలు రేగుతాయి.

– వి.ఇందిర, ఐద్వా, జిల్లా ఉపాధ్యక్షురాలు, పార్వతీపురం మన్యం

మండలాల వారీగా దుకాణాల ఏర్పాటు ఇలా..

మండలం	దుకాణాల కేటాయింపు
పార్వతీపురం అర్బన్	4
పార్వతీపురం రూరల్	4
సీతానగరం	4
బలిజిపేట	5
సాలూరు అర్బన్	5
సాలూరు రూరల్	2
పాచిపెంట	3
మక్కువ	3
కురుపాం	2
గుమ్మలక్ష్మీపురం	2
జియ్యమ్మవలస	2
గరుగుబిల్లి	3
కొమరాడ	2
పాలకొండ అర్బన్	4
పాలకొండ రూరల్	2
సీతంపేట	2
వీరఘట్టం	2
భామిని	1

గాంధీజీ ఆశయాలు అనుసరణీయం



కలెక్టర్ కార్యాలయంలో గాంధీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, తదితరులు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు అనుసరణీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలు దేశానికి ఆదర్శమన్నారు. గాంధీజీ బోధనలు ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్నారన్నారు. అహింసా సిద్ధాంతం విశ్వవ్యాప్తంగా గొప్పమార్గాన్ని చూపిందని తెలిపారు. గాంధీజీ సత్యనిష్ఠ, సాధారణ జీవనం, నిజాయితీ గొప్ప వారసత్వ సంపదగా గ్రహించాలన్నారు. ఈ ప్రాంతంలో పొందూరు ఖాదీ పట్ల గాంధీజీ ఎంతో ఆకర్షితులయ్యారన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి గొప్ప పరిపాలనాదక్షుడని కొనియాడారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, కలెక్టర్ కార్యాలయ ఏఓ ఎం.సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో కొత్త సంకల్పం

పార్వతీపురం టౌన్: గాంధీజీ స్ఫూర్తితో కొత్త సంకల్పం తీసుకోవాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీజీ 155 జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతజాతికి మహాత్మా గాంధీజీ గొప్ప స్ఫూర్తి ప్రదాతగా పేర్కొన్నారు. దక్షిణ ఆఫ్రికాలో రైలు పెట్టె నుంచి బయటకు తోసివేసిన సంఘటన మహాత్మా గాంధీజీ జీవితంలో గొప్ప మార్పును తీసుకువచ్చిందన్నారు. దక్షిణ ఆఫ్రికా వాసులు, అచ్చట ఉన్న భారతీయుల హక్కులను కాపాడేందుకు పోరాటం చేసి అనేక సదుపాయాలు వచ్చేలాచేశారన్నారు. సత్యం, అహింసలే ఆయుధాలుగా గాంధీజీ భారత స్వరాజ్య సంగ్రామ చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికారని, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ లాంటి ఉద్యమాలలో యావత్ దేశ ప్రజలలో స్వరాజ్య స్ఫూర్తిని రగిలించారని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా శాంతియుత మార్గంలో పోరాడి భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేలా కృషి చేశారన్నారు. ఎన్నో ఉద్యమాలకు అహింసా మార్గంలో రూపకల్పన చేసి గొప్ప మార్గదర్శకత్వం వహించారని తెలియజేశారు.



మహాత్మా గాంధీ చిత్రపటానికి గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం

పార్వతీపురం: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ దివస్‌ను పురస్కరించుకొని పలు పంచాయతీల గ్రీన్ అంబాసిడర్లను బుధవారం సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గతనెల 17 నుంచి నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల నిర్వహణలో జిల్లాకు రాష్ట్రంలో నాలుగో స్థానం లభించిందని తెలిపారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను నిర్వహించి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఒక సంపద సృష్టించే కేంద్రాన్ని ఏర్పాటుచేయాలన్నారు. అందరి సహకారంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు విజయవంతమవుతాయని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలోని 451 పంచాయతీల్లో 3,900లకు పైగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. చక్కని పనితీరు చూపిన 15 పంచాయతీల కార్యదర్శులు, 30 మంది గ్రీన్ అంబాసిడర్స్‌ను గుర్తించి సన్మానించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌అంబాసిడర్లు, కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వంద రోజుల్లో చేసిన మంచి ఏంటి?

- పాలనలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం
- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమల్లో విఫలం
- అధికారుల అలసత్వంతో విద్యుత్ ప్రమాద మరణాలు
- పెరిగిన నిత్యావసరాలు, విద్యుత్ చార్జీలతో ప్రజలకు ఇబ్బందులు
- ఇసుక కొరతతో రోడ్డున పడుతున్న భవన నిర్మాణ కార్మికులు
- పెన్షన్ల పంపిణీలోనూ ప్రారంభమైన చేతివాటం
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు




మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేసినదేమీ లేకపోయినా అధికార యంత్రాంగంతో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడం విడ్డూరంగా ఉందని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. నూతనంగా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రతిపక్షాలు కనిష్ఠంగా 6 నెలలు, గరిష్ఠంగా ఏడాది పాలన గమనించి విమర్శలు చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనపై ప్రజల నుంచి వ్యతిరేకత ప్రారంభమైంది. దీనికి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమే ప్రధాన కారణం. ఇప్పటి వరకు పింఛన్ల పంపిణీ మినహా ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. నిత్యావసరాల ధరలు పెరగడంతో పాటు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారు. విజయనగరం జిల్లాలో ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది.

సాగుకు లేదు భరోసా...



ఆరుగాలం శ్రమించి పదిమందికి పట్టెడన్నం పెట్టే రైతాంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను నేరుగా అందజేస్తే, నేడు ప్రైవేటు ఏజెన్సీల వద్దకు వెళ్లి వారు నిర్ణయించిన ధరలకు, వారు పెట్టిన నిబంధనలకు అనుగుణంగా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడం నిజం కాదా?. పక్క జిల్లాలో ఉన్న రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజారపు అచ్చెన్నాయుడు హాజరైన జెడ్పీ సమావేశంలో అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఎరువుల సరఫరాలో విఫలమయ్యారని చెప్పడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతుల అవసరాలను గుర్తించి గత ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఆదిశగా కనీస ఆలోచన చేయలేదు. సాగుకు భరోసా కరువైంది.

పించన్ల పంపిణీలో చేతివాటం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా నేరుగా వారి ఇళ్లకు పింఛన్ మొత్తాన్ని అందజేస్తే కూటమి ప్రభుత్వ హయాంలో ఆ విధానానికి స్వస్తి చెప్పడమే కాకుండా లబ్ధిదారులకు అందించే మొత్తంలో చేతివాటం ప్రదర్శించే ప్రక్రియ ప్రారంభించడం సిగ్గుచేటు. గత నెలలో ఒక్కో లబ్ధిదారుని నుంచి రూ.500 వసూలు చేశారు. ఈ విషయాన్ని అధికారుల వద్ద ప్రశ్నిస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరువస్తుందన్న భయంతో నీటి పన్ను కోసం వసూలు చేశామంటూ చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. కేవలం 1వ తేదీనే పింఛన్ పంపిణీ చేస్తామని ప్రచారం చేయడంతో లబ్ధిదారులు ఆ మొత్తం అందుకునేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర సహకారం ఎక్కడ...?



జిల్లాలోని భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారం ఏమిటని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నట్టు తరుచూ పర్యటనలుచేస్తున్న పక్క జిల్లాకు చెందిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆ ప్రాంతంలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలి. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు చేపడుతున్న ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్దిష్ట సమయంలోగా పని పూర్తి చేసే సామర్థ్యం కలిగిన సంస్థ. మిగులు పనులను రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి చేపట్టాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు నెక్కల నాయుడుబాబు, మీసాల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

భోజన పథకం అమలుపై పర్యవేక్షణ కరువు

ప్రభుత్వ విద్యా సంస్థల్లో అమలు చేస్తోన్న మధ్యాహ్న భోజన పథకం అమలుపై పర్యవేక్షణ కొరవడింది. విద్యార్థులు కలుషిత ఆహారాన్ని తిని అస్వస్థకు గురవుతున్నారు. ఇటీవల ఎస్.కోట, బొబ్బిలి ప్రాంతాల్లో జరిగిన సంఘటనలే దీనికి నిదర్శనం. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు భయందోళన చెందుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు తరలిపోయే పరిస్థితి దాపురించింది.

భవన నిర్మాణ కార్మికుల ఆకలి కేకలకు కారణం ఎవరు..?

ఉచిత ఇసుక విధానం అమల్లో వైఫల్యం చెందడంతో భవన నిర్మాణ దారులతో పాటు ఆ రంగంపై ఆధారపడి జీవించే కార్మికులు ఆకలి కేకలు పెడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటుచేసి రూ.700 నుంచి రూ.850కు టన్ను ఇసుక విక్రయిస్తే నేడు నిర్మాణదారులు రూ.1700 నుంచి రూ.2000 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. నిర్మాణ రంగం కుదేలైంది. ఇసుక కొరత కారణంగా ఆ రంగంపై ఆధారపడి జీవించే భవన నిర్మాణ కార్మికులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుండడమే దీనికి తార్కాణం.

జిల్లాలో పెరిగిన విద్యుత్ ప్రమాద మరణాలు



ప్రభుత్వ నిర్లక్ష్య పాలనతో జిల్లాలో విద్యుత్ ప్రమాద మరణాల సంఖ్య పెరిగిపోయింది. ప్రతి 3 నుంచి 4 రోజులకు విద్యుత్ ప్రమాదంతో మరణాలు సంభవించటం దురదృష్టకరం. గడిచిన 100 రోజుల్లో విజయనగరం జిల్లాలో 22 మంది విద్యుత్ ప్రమాదాలు కారణంగా మృత్యువాత పడ్డారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్య వైఖరే దీనికి ప్రధాన కారణం. పంట పొలాల్లో వైర్లు తెగిపడినా, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి పాడైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

క్లుప్తంగా

బీజేపీది దురహంకార పాలన..

- డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్

విజయనగరం ఫోర్ట్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం దురహంకారంతో పాలన సాగిస్తోందని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ ఆరోపించారు. ఈ మేరకు బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ తోటపాలెం సత్య కళాశాల దగ్గరున్న గాంధీ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్ల బీజేపీ పాలన విభజించు - పాలించు పద్ధతిలో సాగిందన్నారు. బీజేపీ నాయకులు దేశంలో కుల, మతాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



మద్యం సీసాలు, నిందితుడితో ఎస్‌ఐ రమేష్

బొబ్బిలి: పట్టణంలోని దిబ్బవీధికి చెందిన వేగి సూరిబాబు 242 మద్యం సీసాలను బైక్‌పై తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు. సీఐ కె.సతీష్‌కుమార్ ఆదేశాలతో మంగళవారం రాత్రి దాడితల్లి గుడి వద్ద కాపు కాయగా సదరు వ్యక్తి రెండు బ్యాగుల్లో రూ.37,200 విలువైన మద్యం సీసాలను తరలిస్తున్నాడన్నారు. సదరు బైక్‌ను, మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రమేష్ చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



దూసి వసంత్‌కుమార్

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామానికి చెందిన దూసి వసంత్‌కుమార్ అదృశ్యంపై అతని తమ్ముడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.కళాధర్ తెలిపారు. గత నెల 15న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిన వసంత్‌కుమార్ ఇంత వరకు ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 100 లేదా 63099 90873 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ అప్పలనాయుడు

గంట్యాడ: మండలంలోని జగ్గాపురం గ్రామానికి చెందిన మొయిద అప్పలనాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే...అప్పలనాయుడు తన అత్తవారి గ్రామమైన విజయనగరం మండలం మలిచర్ల గ్రామంలో భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నాడు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య వివాహేతర సంబంధం విషయమై కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం కూడా ఇద్దరూ గొడవ పడ్డారు. తాపీ పనికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన అప్పలనాయుడు తన స్వగ్రామం జగ్గాపురం వచ్చేశాడు. అక్కడ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన అప్పలనాయుడు తండ్రి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్న అప్పలనాయుడును చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం బంధువులకు అప్పగించారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సాయికృష్ణ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹124	₹218	₹228

కూటమి పాలనలో... గాంధీజీ ఆశయాలకు తూట్లు

- మహాత్మా.. మన్నించు...
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి తూట్లు
- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీడిక రాజన్నదొర తదితరులు

సాలూరు: రాష్ట్రంలో టీడీపీ కూటమి పాలనలో జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా దేశంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందిస్తే.. నేటి కూటమి పాలనలో అంబేడ్కర్ రాజ్యాంగం కనుమరుగై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్‌సీపీ పాలనలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని తెలిపారు. నేటి కూటమి పాలనలో వలంటర్ల వ్యవస్థ ఊసే లేకుండా పోయిందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సైతం మార్చి తద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను, గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడుస్తున్నారని చెప్పారు.

నాడు ఇంటి వద్దే సమస్యల పరిష్కారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ద్వారా పంచాయతీ స్థాయిలో, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు, ఐటీడీఏల్లో, కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లు నిర్వహించి వారి సమస్యలను ఎంతో చిత్తశుద్ధితో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరం కూడా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించామని తెలిపారు. వలంటీర్లను ఇళ్ల వద్దకే పంపించి వారి సమస్యలు పరిష్కరించామన్నారు. అందుకే నాడు గ్రీవెన్స్‌లు తక్కువగా వచ్చాయని పేర్కొన్నారు. నేడు కూటమి పాలనలో పాలకులు వారి ఇళ్లకు ప్రజలను పిలిపించుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని పెత్తందారి వ్యవస్థ నడుస్తోందన్నారు. కూటమి పాలనలో వలంటీర్లను తొలగించారని, కేజీబీవీ, ఉపాధి హామీ తదితర శాఖల్లో పని చేస్తున్న వారిని ఏదో ఒక సాకుతో తొలగించి, కూటమి నాయకులకు నచ్చిన వారికి ఉద్యోగాలు వేస్తున్నారని మండిపడ్డారు.

బ్రాందీ రాష్ట్రంగా మార్చేస్తున్నారు...

కూటమి పాలనలో బ్రాందీ రాష్ట్రంగా ఏపీని మారుస్తున్నారని తెలిపారు. తాగండి, తూగండి, కొట్టుకు చావండి.. కానీ సూపర్ సిక్స్ పథకాలను అడగొద్దనే విధంగా రూ.99లకే బాబు బ్రాండ్ మద్యాన్ని మరింత చేరువ చేసేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం అమలు చేయకుండా తండ్రికి ఇంధనం ఇస్తున్నారంటూ మండిపడ్డారు.

మహాత్మా.. మన్నించు...

కూటమి వంద రోజుల పాలనలో సూపర్ సిక్స్ పథకాల హామీలు అట్టర్‌ప్లాఫ్ అయ్యాయని, విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. వంద రోజుల పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు దేవుడును కూడా రాజకీయాల్లోకి తీసుకురావడం బాధకరమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్న రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలు, దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. అప్రజాస్వామిక పాలనపై మాట్లాడుతున్న వారిపై కేసులు పెడుతున్నారని తెలిపారు. మహాత్మా.. అందుకే ఈ విషయాలను నీకు విన్నవించుకుంటున్నా.. నేటి పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పాచిపెంట మండల ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు గొర్లె జగన్, దండి శ్రీనివాసరావు, గిరి రఘు, మువ్వల ఆదయ్య పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, ఆచారాలు కాపాడుకోవాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు
- ఏబీవీపీ ఆధ్వర్యంలో జనజాతి విద్యార్థుల సమ్మేళనం



అంతర్జాతీయ అంధుల క్రికెట్ రవళిని సన్మానిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తదితరులు

విజయనగరం: ఆధునిక ప్రపంచంలో గిరిజన సంస్కృతి, ఆచారాలు కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని పీఎస్ఆర్ స్కూల్ ఆవరణలో గత రెండు రోజులుగా నిర్వహించిన జనజాతి విద్యార్థుల సమ్మేళనం బుధవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ డివిజి.శంకరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఛత్రపతి శివాజీ, అల్లూరి సీతారామారాజు వంటి అనేకమంది గిరిజనులు వెంట నడిచి ప్రాణాలు సైతం అర్పించారని గుర్తు చేశారు. అడవిని, నీటిని, భూమిని నిత్యం దేవతలుగా కొలుస్తూ, ప్రకృతి మాత బిడ్డలుగా గిరిజనులు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు జాతీయ భావాలతో, దేశం కోసం ధర్మం కోసం గిరిజన సంస్కృతినీ పరిరక్షిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, క్రీడల్లో ముందుకు వెళ్లాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ అంధుల క్రికెటర్ రవళి, జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలో బంగారు పతకం సాధించిన సింహాచలంలను సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు విద్యారంగ సమస్యలపైన తీర్మానం చేసి ఆమోదించారు. కార్యక్రమంలో ఏబీవీపీ అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి గోవింద్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తారకేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జయచంద్ర, జాతీయ కార్యవర్గ సభ్యుడు అంగనైని ఆనంద్, విభాగ్ కన్వీనర్ బొబ్బది సాయికుమార్, గిరిజన విద్యార్థుల కన్వీనర్ గెమ్మలి కళ్యాణ్, జిల్లా కన్వీనర్ సంపత్, ఏబీవీపీ నాయకులు, వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతి ప్రక్రియ చేపట్టాలి

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి రాము నాయుడు

విజయనగరం అర్బన్: జిల్లాలో పదోన్నతులకు కేటాయించిన ఖాళీలను భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో తీర్మానించారు. తొలిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లాలో పదవీ విరమణ కారణాల వల్ల ఖాళీగా ఉన్న పోస్టులలో పదోన్నతి కోటాను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇజ్జురోతు రామునాయుడు, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పీవీకే సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రమణ, కె.సంతోషలక్ష్మి, జిల్లా గౌరవ అధ్యక్షుడు వివి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ



కేసుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం టౌన్: ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి బుధవారం పార్వతీపురం సబ్-డివిజినల్ పోలీసు కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. పెండింగ్‌లో వున్న కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నది ఆరా తీశారు. కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధానాలపై ఎస్పీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యాలయంలో నిర్వహించే రికార్డ్స్ పెండింగ్ లేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రణకు సబ్ డివిజన్ పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. సబ్ - డివిజనల్ పరిధిలో గల శాంతి భద్రతల సమస్యల గురించి అడిగి తెలుసుకొని, సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాలన్నారు. పార్వతీపురం సబ్-డివిజనల్ అధికారి అంకిత సురాన, సిబ్బంది పాల్గొన్నారు.

‘పైడితల్లి’ జాతరను విజయవంతం చేయాలి



సాకేటివీధి పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

- డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని, అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం సాకేటి వీధి, కమ్మవీధిలో ఉన్న పెద్దలతో విడివిడిగా చర్చించారు. ఉత్సవాలు నిర్వహించే తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు ప్రతీ ఏటా తమకు ఎదురయ్యే ఇబ్బందులను డీఎస్పీకి వివరించారు. హుకుంపేట నుంచి అమ్మవారి ఆలయానికి వచ్చేటప్పుడు పోలీసులు బారికేడ్లు వేసి, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా కమ్మవీధికి చెందిన పెద్దలు పలు ఇబ్బందులను వివరించారు. మసీదు వద్దకు వచ్చేటప్పుడు బారికేడ్లు పెట్టేయడం వలన ఇబ్బందిగా ఉందని, లోపలికి ప్రవేశించేటప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. తిరిగి వెళ్లేటప్పుడు కూడా రోప్ పార్టీలు పెట్టి అమ్మవారి సేవకులను పంపించాలని సూచించారు. ఈ విషయమై డీఎస్పీ స్పందిస్తూ పైడితల్లి అమ్మవారి జాతర ఉత్సవాలలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని హామీనిచ్చారు. జిల్లా పోలీసు శాఖ తరపున పూర్తి సహాయ, సహకారాలందిస్తామన్నారు. అమ్మవారి సంబరాలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమ్మవీధి, సాకేటివీధి పెద్దలు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల్లో దుర్గాదేవీకి ప్రత్యేక అలంకరణలు

విజయనగరం టౌన్:

శరన్నవరాత్రులను పురస్కరించుకుని పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు బుధవారం పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ అమ్మవారు ప్రతీరోజూ ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారన్నారు. 3న గురువారం అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవీగా, 4న శుక్రవారం గాయత్రీదేవీగా, 5న శనివారం అన్నపూర్ణాదేవీగా, 6న ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవీగా, 7న సోమవారం మహా చండీదేవీగా, 8న మంగళవారం శ్రీ మహాలక్ష్మీదేవీగా, 9న బుధవారం మూలానక్షత్రం పురస్కరించుకుని అమ్మవారు శ్రీ సరస్వతీదేవీగా అలంకరణ చేస్తారన్నారు. అదేవిధంగా 10న గురువారం దుర్గాష్టమి పురస్కరించుకుని శ్రీ దుర్గాదేవీగా, 11న శుక్రవారం మహర్నవమి సందర్భంగా శ్రీ మహిషాసుర మర్దినిదేవీగా, 12న శనివారం విజయదశమి పురస్కరించుకుని అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవీగా భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. పది రోజుల పాటూ అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చనలను నిర్వహిస్తారన్నారు. భక్తులందరూ పూజల్లో పాల్గొని తరించాలని కోరారు. వివరాలకు వనం గుడి 08922-233972, చదురుగుడి 233744 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే బాలికల మృతి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఇద్దరు గిరిజన విద్యార్థినిలు మృతి చెందిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంగళవారం కొమరాడ మండలం కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కద్రక శారద, గుమ్మలక్ష్మీపురం మండలంలోని పి.ఆమిటి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని నిమ్మల అవంతి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారని గుర్తు చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకాలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థినిల మృతికి కారణాలు తెలుసుకోవాలని, నిర్లక్ష్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థినిల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిపై హత్యాయత్నం

బొబ్బిలి: పట్టణంలోని మెహెర్ కాలనీకి చెందిన వంగపండు సత్యనారాయణపై హత్యాయత్నానికి పాల్పడిన యామల గణేష్ నాయుడును హత్య చేయబోయాడన్న ఆరోపణపై అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు. సత్యనారాయణ, గణేష్‌కు పదేళ్ల కిందట ఇంటి తనఖా నిమిత్తం రూ.4.50లక్షలు ఇచ్చాడు. ఇటీవల గణేష్ ఆ ఇంటిని మరొకరికి విక్రయించాడు. కానీ, సత్యనారాయణకు తనఖా డబ్బులివ్వలేదు. దీనిపై కోర్టును ఆశ్రయించగా కోర్టు ఇటీవల చాటింపు వేయించింది. ఈ ఘటనపై కోపోద్రిక్తుడైన గణేష్ బుధవారం ఉదయం 8.30 గంటలకు కత్తితో వచ్చి సత్యనారాయణ ఇంటికి వచ్చి గొడవ పడుతూ మీరు చేసిన పనికి మిమ్మల్ని చంపుతానంటూ సత్యనారాయణను గాయపర్చాడు. సత్యనారాయణ భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గణేష్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తరలించినట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కురుపాంలో జాబ్‌మేళా రేపు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 4న కురుపాంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదువుకొని 18 - 25 సంవత్సరములు ఉన్న నిరుద్యోగ యువతి, యువకుల కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పలు కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు వివరాలను హెట్‌టీటీపీఎస్://స్కిల్ యూనివర్స్.ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబరుతో పాటుగా ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఒరిజినల్ జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరిగే ప్రదేశంలో హాజరు కావాలని కోరారు. వివరాలకు 6303493720, 8978878557 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర కార్మిక సంఘాలు విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం నిరసన దీక్ష జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బెహరా శంకర్ రావు, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కె.అప్పలసూరి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 32 మంది విద్యార్థుల ప్రాణ త్యాగాలతో, 67 మంది ఎంపీల రాజీనామాలతో, 30 గ్రామాల రైతుల 32వేల ఎకరాల భూముల త్యాగంతో సాధించుకున్నామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో తయారయ్యే నాణ్యమైన ఉక్కును ప్రైవేటు ఉక్కు సంస్థలు ప్రజలకు ఎందుకు అందించలేకపోతున్నాయో సమాధానం చెప్పాలన్నారు. సొంత ఘనులు లేకపోయినా ముడిసరుకు అవసరం మేరకు అందించిన సంవత్సరంలో 120 శాతం సామర్థ్యంతో పని చేయటం కనిపించలేదా.. అని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక తిరుపతి వేంటేశ్వరస్వామిని అడ్డం పెట్టుకుని ప్రజల నెత్తిపై భస్మాసుర హస్తం పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తూ ఊరుకోరని, ఉద్యమాలతో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టీవీ రమణ, జిల్లా కార్యదర్శులు బి.సూర్యనారాయణ, ఎ.గౌరినాయుడు, నగర కార్యదర్శి బి.రమణ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు అప్పలరాజు, కె.గౌతమి, జి.సత్యారావు, కె.రాకేష్, సీఐటీయూ నాయకులు హరిబాబు, రాములు, శ్రీను, సూరిబాబు, సాయి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామతీర్థంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో గురువారం నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించి దేవస్థాన సిబ్బంది ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం సాయంత్రం స్వామి సన్నిధిలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలు నిర్వహించి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురారోపణం జరిపిస్తారు. 4న అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, యాగశాలలో విశేష హోమాలు జరిపించనున్నారు. ప్రత్యేక పూజలనంతరం ఈ నెల 9న శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరగనుంది. 12 పూర్ణాహుతి, అవబృదం చక్రస్నానం, జమ్మివేట కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించి ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. 13న శ్రీ వేంకటేశ్వరస్వామికి పుష్ప యాగం జరిపించి బ్రహ్మోత్సవాలను పూర్తి చేయనున్నారు. భక్తులు ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని ఈఓ వై.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్..



ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శిస్తున్న ఫ్లాష్‌మాబ్

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విద్యార్థులు ‘స్వచ్ఛతా హి సేవ’లో భాగంగా నగరంలో బుధవారం నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. అంబేద్కర్ జంక్షన్, కోటా జంక్షన్ వద్ద నాటకం, డ్యాన్స్‌ల ద్వారా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ బొంతు కోటయ్య, స్వచ్ఛతా హి సేవా-2024 కో ఆర్డినేటర్ డాక్టర్ డి. నారాయణ, యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ పాల్గొన్నారు.